డాక్టర్ సావిత్రి ఇంట్లో అడుగుపెట్టేసరికి సితాపతి మామయ్య పడక కుర్చీలో కూర్చుని సిగరట్ కాలుస్తూ ప్రపంచం గురించి వ్యాఖ్యానిస్తున్నాడు. సీతాపతి మామయ్య అలా ప్రతి విషయం గురించి వ్యాఖ్యానించడం సావిత్రి చిన్నప్పటి నుంచీ తెలుసు. ఈ మధ్య నెందుకో ఆయన వాదనలు వ్యాఖ్యలు .. ఎప్పుడంటే అప్పుడు ఆయన తమ ఇంటికి వచ్చి కూర్చుని ప్రతీ విషయం కలుగజేసుకోవడం




సావిత్రికి నచ్చడం లేదు. సరిగ్గా మధ్యాహ్నం కాఫీ వేళకి రావడం, సుధీర ఆఫీసు నుంచీ వచ్చే వరకు వుండడం ఆపైన వెళ్లడం అయనకి అలవాటైంది. సుధీరంటే ఆయనకి పడదు.

సితాపతి మామయ్య రష్యాలో కమ్యూనిజం పడిపోవడం గురించీ, మొన్నీ మధ్య జరిగిన ఆడవాళ్ళ సభల గురించీ వ్యాఖ్యానిస్తున్నాడు. సావిత్రి బట్టలు మార్చుకుని కాఫీ త్రాగి వచ్చి కూర్చుంది. " ఇంట్లో చద్దివాసనలు వస్తుంటే ఏమిటో అనుకున్నాను. పెద్దలు మాటలన్న మాట. కొంచెంఎక్కువ చద్దివాసన వేస్తున్నాయి" అంటూ లోపలికి వచ్చింది సుధీర.

"వస్తాను సూర్యం. నేను చెప్పిన సంబంధం గురించి ఆలోచించు--" అనేసి లేచి వెళ్లి పోయేడు సీతాపతి. సుధీరకి పెళ్లి కాలేదని అతనికి చాలా బాధగా వుంది. అతనికి చాలా బాధలున్నాయి. అడ్డమైన వెధవలు మాట్లాడం మొదలుపెట్టారని బాధ. ఆడవాళ్లు వీధిన పడిపోతున్నారని బాధ. తన ప్రియమిత్రుడు సూర్యనారాయిణ కుటుంబం చితికి పోతొందని బాధ. పాపం ప్రపంచంలో వున్నవీ లేనివీ బాధలన్నీ ఆయనవే.


"ఆయన వచ్చినప్పుడల్లా నువ్వు ఏదో ఒకటి అంటావు. పెద్దా చిన్నా లేదా నీకు?" అన్నాడు సూర్యనారాయణ. "ఆయనే అందర్నీ అంటాడు." అంది సుధీర. తన పిల్లలు ముగ్గుర్లోకి సుధీర గయ్యాళిదనీ అదుపు తప్పిపోతోందని అనుకుంటాడు సూర్యనారాయణ. అంతేకాదు పోలికలన్నీ తన భార్యవే పుణికి పుచ్చుకున్న ఈ సుధీర, తన భార్య అణిచి వేసుకున్న భావాలకు ప్రతిరూపమేమో అని కూడా అనుకుంటాడు. ఇప్పుడాయన వేదన సుధీర గురించి కాదు. అది తన మాట ఎలాగు వినదు. సావిత్రి గురించి. సావిత్రి గురించే తన వేదన.

ఎలా పెంచాడు సావిత్రిని తన ప్రాణం కన్నా మిన్నగా పెంచాడు. సావిత్రి కోసం తన భార్య సుభద్రకి అన్యాయం చేశాడు. తన కన్నా పదిహేను సంవత్సరాలు చిన్నదైన సుభద్రని వివాహం చేసుకున్నది కూడా సావిత్రి కోసమే. చనిపోయిన తన అక్క భర్తని, ఎనిమిదేళ్ళ కూతురున్న వాణ్ణి, పెళ్ళి చేసుకోవలసివచ్చిన ఏ ఆడపిల్లయినా బాధతోనే వస్తుంది. ఆ బాధని కాస్తలో అయినా తగ్గించడానికి తను ప్రయత్నించలేరు. దిక్కుమాలిన, డబ్బు లేక, కట్నం యిచ్చుకోలేక తనని చేసుకుంది అనుకున్నాడు.

"రెండవ భార్య కదా అని నెత్తినెక్కించుకోకు. ఎంత అక్క కూతురైనా సవతి కూతురు సవతి కూతురే. సావిత్రిని నువ్వే కనిపెట్టి వుండు." అని సీతాపతి లాంటి వాళ్ళు సలహా యిస్తే నిజమేనని నమ్మాడు.

ఆ ఇంటికి తను అక్క స్థానంలో రాలేదని, సావిత్రికి

సవతి తల్లిగా, సూర్యనారాయిణకి రెండవ భార్యగా మాత్రమే వచ్చానని అర్థం చేసుకునేలా చేశాడు. అప్పటి నించీ సుభద్ర నోరు మూసుకునే వుంది. ఆ ఇంట్లో సావిత్రికి ఒక ప్రత్యేక హోదా యిచ్చాడు. ఆమె పోషక బాధ్యత పూర్తిగా సుభద్రకెప్పుడు అప్పజెప్పలేదు. సావిత్రి తనూ ఒకటి. సుభద్ర ఒకటే ఒకటి. సావిత్రి తన మనిషి. సావిత్రి సుభద్ర కలవకుండా వీలైనంత జాగ్రత్త పడ్డాడు. అచ్చం తన అక్కలా వుండే సావిత్రిని దగ్గరకు తీసుకోవాలని ఎన్నోసార్లుప్రయత్నించి ఓడిపోయింది సుభద్ర.



తరువాత ఆమెకు సుందరం పుట్టాడు. సుందరాన్ని చూసుకుంటూ సావిత్రికెక్కడ ప్రమాదం తలపెడతుందోనని కాపలాలు కాసేవాడు. అలాంటి సావిత్రి తనకి ఇప్పుడు మళ్లీ రెండవసారి షాక్ యిచ్చింది. సీతాపతిదీ సూర్యనారాయణది ఇరవై అయిదేళ్ళ స్నేహం. వాళ్ళిద్దరూ ప్రభుత్వోద్యోగం చేసి రిటైరయ్యారు. ఒకే వీధిలో ఇళ్ళు కట్టుకున్నారు. వాళ్ళిద్దరూ దూరపు బంధువులు. బంధుత్వం కన్నా వాళ్ల మధ్య స్నేహమే ఎక్కువ అని చూసేవాళ్ళు అపోహపడతారుగానీ, వాళ్ళని కులాభిమానమూ, బంధత్వము సన్నిహితం చేశాయని వాళ్లిద్దరికీ తెలుసు.

సీతాపతి తన ఇంటికి మకుటం లేని మహారాజుగా ఈనాటికీ వెలుగొందుతున్నాడని, అతని మీద అతనికిగాక సూర్యనారాయణకి కూడా గౌరవం. అతను ప్రయోజకుడని నమ్మకం. తనలాగ ఎత్తుకి ఎగిరి పడకుండా, ఇద్దరాడ పిల్లలకు పద్దెనిమిది దాటకుండా పెళ్ళిళ్లు చేసేశాడు. కొడుక్కి ఉన్న వూరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని, ఉద్యోగం, సద్యోగం అని గంతులు వెయ్యకుండా ఇంటి పట్టునుండి అత్తగారికి పనిలో సాయం చేసే అమ్మాయిని కాస్త ఎక్కువకట్నంతోనే వెతికి తెచ్చాడు. ఈ రోజుకీ అతని 'నాన్నతనం' నిర్విఘ్నంగా చలామణీ అవుతుంది. సీతాపతిది గట్టిగుండె. వాడెంత చెప్పినా వినకుండా తను సావిత్రిని ఎం.ఏ. చదివించాడు. అది యూనివర్సిటీ ఫస్టొచ్చిందని తెలిసి గర్వపడ్డాడు కానీ అది పీటర్ అనే కుర్రవాణ్ణి పెళ్ళి చేసుకుంటానని చెబితే కుప్పకూలిపోయాడు. నిజానికి ఆ ఆపద నుంచీ తనని దేవుడిలా కాపాడింది సీతాపతే. "ఈ ఫాషన్ పెళ్ళిళ్ళు మన ఇళ్ళల్లో లేవని తెగేసి చెప్పు. మన వంశాలెలాంటివి? నిప్పులాంటివని చెప్పు. నయాన చెప్పితే వినదూ! తల తీసుకుని వెళ్లి రైలు క్రింద పెట్టుకుని ఛస్తానని బెదిరించు. తల్లి పోయిన పిల్లని ఎలా గుండెల మీద పెంచావో కన్నీళ్ళతో చెప్పు. నీ కన్నా పదిహేనేళ్లు చిన్న దాన్ని ఎవరి కోసం పెళ్ళి చేసుకున్నావో గుండె కరిగేలా చెప్పు. అన్ని విధాల చెప్పి దాని మెదడు పనిచెయ్యకుండా చెయ్యి. నరాలు బలహీనం అయ్యేలా చెయ్యి. ఎలా లొంగి రాదో చూడు. నీ ప్రక్కన నేనెప్పుడు వుంటాను. నువ్వు చెప్పే ప్రతీ విషయానికి పది

ఉదాహరణలిస్తాను. ఇది నీ అహంకారానికి చావు దెబ్బ. ఎట్టి పరిస్థితిలోనూ ఈ పెళ్లి కానివ్వకు." అని కర్తవ్యబోధ చేశాడు సీతాపతి. అప్పటినుంచీ ఉదయపు నడకకి కాదు, సూర్యనారాయణని ఎల్లవేళనా నీడలా వెంటాడి ఎలాగైతేనేం, సావిత్రి పీటర్‌ని పెళ్ళిచేసుకోకుండా చెయ్యగలిగాడు. పీటర్ బుద్ధిగా తన మేనమామకూతుర్ని చేసుకుంటున్నట్టు శుభలేఖ పంపాక, సూర్యనారాయణ ఆంజనేయస్వామికి నూట ఎనిమిది ప్రదక్షిణాలు చేసి సీతాపతి ఇంటికి పండ్లు పంపించాడు. "ఈ వేడిలోనే దానికి ఏదో ఒక సంబంధం చూసి ముడేసి పంపేయ్" అని తొంభై ఆరు సంబంధాలు కూడా సూచించాడు.

"నువ్వు పీటర్‌ని చేసుకోవద్దంటే సరేనన్నాను. నాకింక సంబంధాలు చూడకునాన్నా. నేను రీసెర్చిలో చేరతాను. ఉద్యోగం చేసుకుంటాను. దయచేసి నాకు పెళ్ళి సంబంధాలు చూడకు. అప్పుడు నీ బదులు నేను రైలు కింద తల పెట్టాలి" అంది సావిత్రి. "దాని మొహం. అది అలాగే అంటుంది. ఏడాది తిరిగేలోగా సంతానం కలిగితే అన్నీ మర్చిపోతుంది. నా మాట విని బందరు సంబంధం ఖాయం చేసెయ్." అని పీకల మీద కూర్చు న్నాడు సీతాపతి.

కానీ ఈ సారి సూర్యనారాయణ ఆ పని చెయ్యలేక పోయాడు. నెల రాజుల పాటు ప్రతీ రాత్రీ దిండు తడిసి ముద్ద అయ్యేలా ఏడ్చిన సావిత్రిని చూసి అప్పుడప్పుడూ ఆయన గుండె కలుక్కుమనేది. కానీ అది చేసిన తప్పు చాలా పెద్దది కదా అని సరిపెట్టుకునేవాడు.

సావిత్రి రీసెర్చి చేసింది. అక్కడే లెక్చరర్ అయింది. రీడర్ అయింది. ప్రొఫెసర్ సావిత్రి అయ్యింది. మేడమ్ చాలా స్ట్రిక్ట్ అని పేరు తెచ్చుకుంది - ఎవర్నీ ఫేవర్స్ అడగదు; ఎవరికీ ఫేవర్స్ చెయ్యదు అని పించుకుంది - తన సబ్జెక్టులో దిట్ట అనిపించుకుంది - ఎవరితోనూ స్నేహం లేకుండా, ఎవర్నీ యింటికి రానివ్వకుండా, 'సావిత్రీ మేడమ్' అంటే అందరూ గడగడ లాడేలా చేసుకుంది - మేడమ్ చాలా సింపుల్‌గా వుంటారు - అలంకారాలుండవ్ - ఆడంబరాలుండవ్ అంటారు - జీతం తెచ్చి తండ్రికిస్తుంది - ఆవిడకే ఖర్చులూ లేవు - ఆవిడ చీరెలు కూడా ఆవిడ సవతి తల్లే కొంటుందట - పెట్టిందేదో తినేసి యూనివర్సిటీ కొస్తుందట - తన పనేమిటో - తనేమిటో - సావిత్రీ మేడమ్ అంటే నిప్పు - ఎంత గర్వం సూర్యనారాయణికి. సీతాపతికూడా సావిత్రిని మెచ్చుకుంటున్నాడు - స్త్రీ సహజమైన కోరికల్లేకుండా సన్యాసిలాబ్రతికేసే సావిత్రిని మెచ్చుకోకుండా ఎలా వుండడం - "అది సూర్యనారాయణ కూతురు కాదు పెద్ద కొడుకు - వాణ్ణి కడదేర్చేది సావిత్రే సుమా !' అని వ్యాఖ్యానించేవాడు - అలా పాతిక సంవత్సరాలు నిశ్చలన చిత్రంలా వున్న సావిత్రిలో చలనం ప్రారంభం కావడమే వింతగా వుంది - ప్రపంచం పోతున్న వింతపోకడలకు ఇదొక నిదర్శనము. సూర్యనారాయణ చాలా బలహీనుడని అర్థం అయిపోయింది సీతాపతికి. భార్యనీ పిల్లల్నీ అదుపులో పెట్టుకోలేని మగవాడేం మగవాడు ? సీతాపతి తండ్రి ఎనభై అయిదేళ్ళు బ్రతికాడు. ఆయన చనిపోయిన రోజే ఆయన బొడ్లోనుండీ ఇనప్పెట్టె తాళం చెవులు తీశారు. అప్పటి వరకూ ఇంటి యాజమాన్యం అంతా ఆయన చేతిలోనే వుండేది - సీతాపతికి తండ్రే ఆదర్శం. తన కొడుక్కి తను ఆదర్శం కావాలని ఆయన కోర్కె - అయితే తనలో ఇరవై సంవత్సరాల స్నేహం వుండి కూడా సూర్యనారాయణ తన ఇంటిని చక్కదిద్దుకోలేకపోయేడు - అందుకే అతనంటే జాలి సీతాపతికి.

సూర్యనారాయణ తన కొడుకు సుందరాన్ని కూడా సుభద్ర దగ్గర చేరనివ్వకుండా, వాడి చదువు సంధ్యలు తనే చూసుకొని చెప్పుచేతల్లో పెట్టుకున్నాడు. ఎంతైనా కొడుకు కదా! వాడికి అడిగినంత చదివించాడు - అడిగిన వన్నీ కొనిచ్చాడు వండిపెడట్టడం తప్పతల్లి చేసేపన్లు ఏవీ వుండవనీ - తక్కినవన్ని తండ్రి డబ్బుతోనే జరుగుతాయనీ తల్లి కన్న తండ్రే ముఖ్యం అనీ తెలియజెప్పాడు. అలా సావిత్రీ, సుందరం తనకి దూరమయ్యాక, సుధీర ఒక్కతే తన మనిషి అని నమ్మింది సుభద్ర.

సుందరం మాత్రం ఏంచేశాడు. వాడికి లక్షణంగా కట్నం తీసుకుని సంసార పక్షంగా వుండే పిల్లని పెళ్ళి చెయ్యమని సీతాపతి ఎంత చెప్పినా వినలేదు సూర్యనారాయణ. చివరికి వాడు కరుణని వెంటబెట్టుకొచ్చి "ఇదే నా జీవితాన్ని పంచుకునే అమ్మాయి" అని ప్రకటించాడు. కరుణ కులం పేరు విన్నాక సీతాపతి సూర్యనారాయణ కాస్త శాంతించారు గానీ వాళ్ళిద్దరూ "అట్టహాసంగా పెళ్ళి చేసుకోవడం మాకిష్టం లేదు." అని తేల్చేస్తే కొంచెం బాధపడ్డారు. సుందరానికి ఈ వూరు ట్రాన్సఫరవడం సూర్యనారాయణకి నచ్చింది. కాని కరుణ మాత్రం సీతాపతికి అసలు నచ్చలేదు. "నీ కోడలు నాకసలు నచ్చలేదబ్బాయ్ సూర్యం" అని చెప్పేశాడు: ఆ అమ్మాయి చీరెలు కట్టకుండా చుడీదార్లు

సావిత్రీ మేడమ్ అంటే నిప్పు - ఎంత గర్వం సూర్యనారాయణికి. సీతాపతికూడా సావిత్రిని మెచ్చుకుంటున్నాడు - స్త్రీ సహజమైన కోరికల్లేకుండా సన్యాసిలాబ్రతికేసే సావిత్రిని మెచ్చుకోకుండా ఎలా వుండడం - "అది సూర్యనారాయణ కూతురు కాదు పెద్ద కొడుకు - వాణ్ణి కడదేర్చేది సావిత్రే సుమా!' అని వ్యాఖ్యానించేవాడు - అలా పాతిక సంవత్సరాలు నిశ్చలన చిత్రంలా వున్న సావిత్రిలో చలనం ప్రారంభం కావడమే వింతగా వుంది

వేస్తుంది. పైగా అత్తగారని లేకుండా సుభద్రతో చాలా చనువుగా వుంటుంది. ఒకనాడు సుభద్ర చీరె కుచ్చెళ్ళు సరిచేసింది.' ఇంకొకనాడు ఆవిడ తలదువ్వి ముడి వేసింది. ఇంకో రోజు భుజాలమీద చేతులు వేసి గారం చేసింది. "ఆ పిల్లని కాస్త దూరంగా వుంచు " అని చెప్పాడు సూర్యనారాయణ.

సావిత్రికి స్నేహితులులేరు. సుందరానికి వున్నారు. కానీ వాళ్ళంతా మగపిల్లలు--- అందుకు సూర్యనారాయణకి అభ్యంతరం లేదు...సుధీరకి స్నేహితులున్నారు...వాళ్ళల్లో ఆడా మగా కూడా వున్నారు...వాళ్ళు వస్తుంటారు. పాటలు పాడుతుంటారు. గట్టిగా నవ్వుతుంటారు...ఆడా మగా స్కూటర్లు నడుపుతారు. ఇలాంటి పన్లు సావిత్రి చేయకుండా తను చూసుకున్నాడు...కానీ సుధీరని సుభద్ర గాలికి వదిలేసింది. తన మాట లక్ష్యపెట్టనీకుండా చేసింది...సుధీర తన కళ్ళల్లోకి సూటిగా చూస్తుంది...ఆ కళ్ళు చూస్తే తనకెందుకో కొంచెం జంకు...పైగా దాని తర్కం తను భరించలేడు. ఆ చిరాకంతా సుభద్రపై చూపిస్తాడు... అందుకే సుధీరకి త్వరగా పెళ్ళి చేసెయ్యమని సీతాపతి చెబుతాడు. "అదింకో పీటర్ని తెస్తుంది జాగ్రత్త"అని హెచ్చరిస్తాడు. సుధీర కొరకరాని కొయ్య అయిపోయింది. ఇప్పుడు కరుణ అలాగే తయారైంది. ఆ అమ్మాయికున్నంతమంది స్నేహితుల్ని ఇంతవరకూ ఎవరికీ చూడలేదు. సుధీరని మించిపోయింది. ఇంట్లో వున్న కాసేపూ కూని రాగాలు తీస్తూవుంటుంది. ఇంట్లో కాలు పెట్టిన మర్నాడే "మామయ్యా!కాఫీ .యివ్వనా? పంచదార వేసుకుంటావా?" అని ఏకవచనంలో సంభోదించింది..." అదేమిటి నన్ను మామయ్యగారూ" అని పిలవమని చెప్పు" అని సుభద్రచేత చెప్పించాడు.

"మీరూ ... గారూ అంటే చనువు లేనట్లు లెక్క ... మానాన్నని కూడా "నువ్వు" అంటాను..."అనేసింది. సుందరాన్ని కూడా "సుందూ" అంటుంది. సీతాపతి ఎక్కడ వినిపోతాడోనని భయం సూర్యనారాయణకి. ఓరోజు సాయంత్రం హాస్పిటల్‌కి బయలుదేరాడు తను...సుందరాన్ని హాస్పిటల్ దగ్గర దింపమని అడిగాడు..."కరుణా మానాన్నని కాస్త హాస్పిటల్ దగ్గర దింపు నాకు పనుంది..." అన్నాడు సుందరం. ఈవిడ వెనకాల స్కూటర్ ఎక్కడమంటే, సీతాపతి చూస్తే ఇంకేమన్నా వుందా!'వద్దులే' అన్నాడు.

పోనీ ఇదంతా ఈరోజుల్లో మామూలే అని సరిపెట్టుకోబోతే...

ఒక రోజు రాత్రి పన్నెండింటికి రైలు దిగి ఒకడొచ్చేడు. వాడొచ్చేసరికి సుందరం నిద్రపోతున్నాడు. కరుణ హాలులో కూర్చుని ఏదో నవల కాబోలు లీనమై పోయి చదువుతోంది. తనకి నిద్ర రాక వరండాలో కూర్చుని సిగరెట్ కాల్చుకుం టున్నాడు. తన ఇంట్లో జరిగే వైపరీత్యాలన్నీ ఒకటొకటే గుర్తుకొచ్చి నిద్రరావడం లేదు సూర్యనారాయణకి. ఆ రోజు సాయంత్రమే సావిత్రి రవీంద్ర స్కూటరెక్కి వచ్చింది. అంతకు మూడునాళ్ల క్రిందట జుత్తు పొట్టిగా కత్తిరించింది. నలభై అయిదేళ్ళ సావిత్రిలో ఈ మార్పులు ఆయనకి నచ్చడం లేదు. మొన్నీ మధ్య జీతం రాగానే తనకి చెప్పాపెట్టకుండా కొన్ని పుస్తకాలు కొనుక్కొచింది. పూర్వం జీతం తన చేతికిచ్చి "పుస్తకాలు కొనాలి నాన్నా ఓ ఐదొందలు తీసుకుంటాను." అనేది.

"అదేమిటి తల్లీ... నీ డబ్బు నువ్వు తీసుకోవడానికి" అంటుంటే చాలా ఆనందంగా వుండేది. రవీంద్ర వొట్టి లెక్చరర్. సావిత్రి ప్రొఫెసర్. వాడికి ముప్పై నిండలేదు. పెళ్ళయింది. ఓ బిడ్డకూడా వుందట. వాడితో ఏమిటి సావిత్రికి స్నేహం? తోటి ఆడ లెక్చరర్లతో, రీడర్లతో, ప్రొఫెసర్లతో లేని స్నేహం నిన్న గాక మొన్న వచ్చి చేరిన వీడితో ఏమిటి? సూర్యనారాయణకి కంపరం వేసింది. ఇల్లు కుళ్ళిపోతోంది అనుకున్నాడు.

అంతలోనే వాడు రైలు దిగి వచ్చి బెల్ నొక్కాడు. కరుణ కుర్చీలో నుంచీ లేచి "హాయ్ నరేన్" అంటూ ఒక ఎగురు ఎగిరి వాడిని లోపలికి ఆహ్వానించింది. పోనీ వెంటనే సుందరాన్ని నిద్రలేపుకు రావచ్చా? లేదు వాడికి తనే మర్యాదలు చేసింది. అప్పటికప్పుడు అన్నం వండి పెట్టింది. ఇద్దరూ హాలులో కూర్చుని తెల్లవార్లూ ఒకటే కబుర్లూ నవ్వులూ.

"నువ్వు పడుకోమామయ్యా!" అని హెచ్చరికలు.

ఇద్దరు పడచు ఆడ మగ మనుషుల్ని అలా వదిలి హాలులో వదిలి తను పడుకుని నిద్రపోగలడా/ పోలేదు. పోలేదు కూడా. తెల్లవారి మేడదిగి వచ్చిన సుందరం వాడిని అమాంతం కౌగలించుకుని కబుర్లు మొదలు పెట్టాడు. నీ పెళ్ళాం హద్దులు మీరి పోయింది రా అబ్బాయి అని చెప్పాలి వాడికి. వాడెక్కడో కలకత్తా నించీ వచ్చాట. వాణ్ణి తీసుకుని దంపతులిద్దరూ ఊరు చూపడానికి పోయారు. అలా వీధిలో నడుచుకుంటూ వాళ్లు వెడుతుంటే సీతాపతి అరుగు మీద కూర్చుని చూశాడట. ముందువాడు, వాడి ప్రక్కన కరుణ, ఆమె ప్రక్కన సుందరం నడుస్తున్నారట.

"ఇద్దరు మగవాళ్ళ మధ్య తనూ ఒక మగ వాడిలా నడిచిపోయింది నీ కోడలు" అని వ్యాఖ్యానించాడు సీతాపతి. సూర్యనారాయణ సిగ్గుతో చితికిపోయాడు. వాడు రెండు రోజులు ఇంట్లో మకాం వేశాడు. ఒకనాడు ఇంటిల్లపాదినీ హోటల్‌కి ఆహ్వానించాడు. తను ససేమిరా రానన్నాడు. సుభద్రని బలవంతం చేసి లాక్కుపోయారు. వచ్చాక సుభద్రని బాగా దులిపి వేశాడు సూర్యనారాయణ.

"ఇదే అదను. ఇప్పుడే నీ కొడుక్కి ఓ వార్నింగ్ యివ్వు. ఆడపిల్లల అత్తగారిళ్ళకి ఆడస్నేహితులే రారు. మగ స్నేహితులు రావడం ఏమిటి? ఇలా వూరుకుంటే రేపు ఇంకొకడొస్తాడు" అని సలహా యిచ్చాడు సీతాపతి.

ఆ రోజు సాయంత్రం అందరూ కూర్చుని వుండగా" చిన్నప్పుడు అందరికీ స్నేహితులుంటారు. ఇలా పెళ్ళయినాక అత్తగారిళ్ళకి రారు. అది మర్యాద కాదు." అని ప్రారంభించాడు

సూర్యనారాయణ. కరుణ నవ్వేసి వూరుకుంది.

"ఆ అర్ధరాత్రి రావడం, నువ్వు కూర్చుని అతనితో కబుర్లు నాకు నచ్చలేదమ్మాయి. నువ్వు మారకపోతే కష్టం. ఈ బజార్లో అంతా నిన్ను చెడ్డగా అనుకుంటున్నారు" అన్నాడు.

"అందరూ ఎవరూ? సీతాపతి మామయ్యేనా? అంది కరుణ.

"అతనెవరు మనని గురించి మాట్లాడటానికి? మన సంగతి మనం చూసుకుంటాం. వాళ్ళింటి గురించి మనం మాట్లాడుతున్నామా?" అన్నాడు సుందరం.

"వాళ్ళిల్లు మనిల్లులా వుండదు. వెళ్లి చూడు. అక్కడ మాట్లాడ్డానికేం లేదు. అంతా క్రమశిక్షణ" అన్నాడు సూర్యనారాయణ.

సుందరం, కరుణా ఒకరి మొహం ఒకరు చూసుకుని వూరుకున్నారు.

"నా ఇంట్లో ఇలాంటివన్నీ నేను సహించను. ఎవడు బడితే వాడు ఎప్పుడు బడితే అప్పుడు వచ్చి తలుపు కొట్టడాలు నాకు నచ్చవు".

"నరేన్ ఎవడు బడితే వాడుకాడు. నా స్నేహితుడు. ఈ ఇల్లు మీ ఒక్కరిదే కాదు. ఇందులో వుండే వాళ్లందరిదీ" అంది కరుణ.

"ఈ ఇల్లు నాది. నేను కష్టపడి నిర్మించిన ఇల్లు" అన్నాడు సూర్యనారాయణ ఆయాసపడిపోతూ. అక్కడితో ఊరు కోక," అర్ధరాత్రి పెళ్లాంతో ఒక మగవాడు కబుర్లు చెబుతూ కూర్చుంటే హాయిగా తన గదిలో నిద్రపోయిన నా కొడుకుని అనాలమ్మా. నిన్ను కాదు అనాల్సింది. ఆ వాజమ్మని అనాలి. అదే సీతాపతి కొడుకైతే వూరుకుంటాడా? నేను తెల్లవార్లూ వరండాలో కూర్చున్నాను. సీతాపతి అయితే కూర్చోడు. వచ్చిన వాణ్ణి తన్ని బయటకి గెంటుతాడు" అన్నాడు మళ్లీ.

"మేం మీలాంటి భార్యా భర్తలం కాము నాన్నా. మాకు ఒకరికి మీద ఒకరికి నమ్మకం, స్నేహం ప్రేమా వున్నాయని అనుకుంటున్నాం. అవి లేవని మేం అనుకుంటే ఎవరిదారిన వాళ్లం పోతాంగానీ అధికారాలతో అతుకులు పెట్టుకోం." అన్నాడు సుందరం.


ఈ సీతాపతితో తడవకి పోల్చుకోవడం నాకేం నచ్చలేదు మామయ్యా! అసలెవరాయన మనింటికి వచ్చి శాసించడానికి/ ఈ ఇల్లు, ఇందులో వుండే మనందరిదీ అనుకుంటే మేం ఇక్కడుండగలం గానీ, మీ ఒక్కరిదే అనుకుంటే వుండలేం. స్వేచ్ఛ లేని చోట మాకు ఊపిరాడదు అందరం కలసి ప్రేమాభిమానాలు పంచుకోగలిగితే వుండాలని వచ్చాం. లేకపోతే వేరే పోతాం." అనేసింది కరుణ.

'పోండమ్మా... పోతే" అన్నాడు సూర్యనారాయణ.

మూడు రోజులు తిరక్కుండా కరుణ సుందరంవేరే ఇల్లు చూసుకుని వెళ్లారు. సుభద్ర వెళ్ళి పాలు పొంగించి వచ్చి చివాట్లు తిన్నది.

"నువ్విలాగే చూస్తూ వూరుకుంటే సావిత్రి వెడిపోతుంది, సుధీర ఎవరితోనో వెళ్ళి పోతోంది. నీ పెళ్లాం కూడా వాళ్ళతో వెళ్ళిపోతుంది. చివరికి నీకెవరూ మిగలరు. ఇదంతా నీ కుటుంబం కూలిపోవడానికి కొచ్చింది. దాన్నిరక్షించుకో. సావిత్రిని కేకలెయ్. సుధీరని కంట్రోల్ చెయ్యి. మీ ఆవిడనోరు మూయించు" అని సూర్యనారాయణని పోరుతున్నాడు సీతాపతి.

సావిత్రి ఇప్పుడు సుధీరతో కబుర్లు చెబుతోంది. ఇద్దరూ కలసి ఫిలిం సొసైటీ సినిమాకి పోయారు. రవీంద్రని భోజనానికి పిలిచారు. రవీంద్ర సావిత్రిని 'మేడమ్' అనడం మానేశాడు రోజుకొక సారి వాడు సావిత్రికి ఫోన్ చేస్తాడు. సావిత్రి ఇప్పుడు చదవడం ఎక్కువైంది. వాడితో వాదనలు.. ఫోన్‌లో గంటల




తరబడి కబుర్లు ... నవ్వులు.. జోకులు... వీళ్లంతా ఏకమైపోయారు. తానొక్కడే అయిపోయాడు. సీతాపతి ఒక్కడే తనని అర్థం చేసుకుంటాడు. తన సంపాదన, తన ఇల్లు కావాలి వీళ్ళకి.. తను ముసలివాడై పోయాడు. అందుకే గౌరవించడం లేదు. సీతాపతి గౌరవాన్ని మొదట్నించీ గుప్పెట్లో పెట్టుకున్నాడు. సూర్యనారాయణకి బ్లడ్ ప్రెషర్ వచ్చింది. 'అడిగెయ్యవోయ్ .. వాడితో నీ కేమిటి సంబంధం అని అడిగెయ్. నీకేం భయం" అని ఎగదోసేడు సీతాపతి.

సావిత్రిని ఇటీవలచాలా ఇన్‌డైరెక్ట్‌గా దెప్పిపొడుస్తున్నాడు సూర్యనారాయణ. సావిత్రి సహిస్తూనే వుంది. అవును. తను ఆమె తండ్రి. ఇంకా గౌరవిస్తోంది. కానీ ఎలా? ఎలా అడగడం? సావిత్రి ఎప్పట్లా యూనివర్సిటీ నుంచి వచ్చి హాలులో కూర్చుంది ఆమె మొహం పూర్వంలా ముడుచుకుని లేదు. నలభై అయిదేళ్లయినా యాభై పై బడిన దానిలా వుండే సావిత్రి ఇప్పుడు సుధీర ప్రక్కన కూర్చుంటే ఆమె కన్నా ఏ అయిదేళ్లో పెద్దదానిలా వుంది. ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. తను ఉద్యోగం చెయ్యడానికే బ్రతుకుతున్నట్లుండే సావిత్రికి జీవితంలో ఉద్యోగం ఒక్కటే కాదు. ఇంకా అనేక ఆనందాలున్నాయని

తెలుసుకున్న జ్ఞానం ఆమె మొఖంలో స్పష్టంగా కనబడుతోంది. ఇదంతా సూర్యనారాయణకి భయంగా వుంది.

"నువ్వు పెళ్ళి వద్దని భీష్మిస్తే నిజం అనుకున్నాను. సీతాపతి మామయ్య చెప్పినట్లు నీకూ అప్పుడే పెళ్ళి చేస్తే ఈ పాటికి అమ్మమ్మవి అయ్యేదానివి. జీవితంలో నీ కోరికలన్నా తీరివుండేవి. నేను చాలా పొరపాటు చేశానమ్మా సావిత్రీ" అన్నాడు.

సావిత్రి ఉలిక్కిపడి..."ఏమంటున్నావు నాన్నా" అంది.

"అవునమ్మా శరీర సహజమైన కోర్కెల్ని మనం ఎంత అణిచి పెట్టినా అవి పైకి లేస్తూనే వుంటాయి. ఎవరో మహాను భావులకు అది సాధ్యం"

"అంటే ... అంటే ఏమిటి నాన్నా నువ్వనేది?"

"నువ్వు పెళ్ళి వద్దంటే నీకు నిజంగా అక్కర్లే దనుకున్నాను. నీకు వయస్సు అయిపోయిందనుకున్నాను. గానీ.. నలభై అయిదేళ్ళ తరువాత మళ్ళీ యవ్వనం వస్తుందనీ, కోర్కెలు చిగురిస్తాయని అనుకోలేక పోయాను."

సావిత్రి కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ వుండి పోయింది. తండ్రి ఏమంటున్నాడో, ఆమెకి అర్థం కాలేదు.

" నువ్వు అక్కని చాలా అవమానిస్తున్నావు నాన్నా. నీ వయస్సుకి తగ్గట్టు నువ్వు మాట్లాడటం లేదు." అంది సుధీర.

"నువ్వు నోర్ముయ్. తాను చెడటంగాక సావిత్రిని చెడగొట్టింది కూడా నువ్వే"

"సావిత్రి చెడిపోయిందని నేనేం అనుకోడం లేదు. ఆ మాటకొస్తే నేనూ చెడిపోలేదు. మేం ఇద్దరం బాగానే వున్నాం" అంది సుధీర.

"నాకన్నీ తెలుస్తూనే వున్నాయి. నా కూతురు నిప్పులాంటిదని గర్వ పడ్డాను. యూనివర్సిటీలో దాని పేరు ప్రతిష్టలు విని గర్వపడ్డాను. ఇప్పుడు తలవంచుకుంటున్నాను."

"ఎందుకని నాన్నా/

"దానికి పెళ్ళయి కొడుకు పుట్టివుంటే వాడికి పాతికేళ్ళొచ్చేవి. ఈ రవీంద్రకి ముప్పై అనుకో. తన కొడుకు ఈడు వాడితో దీనికేమిటి వ్యవహారం/ ఈ వయస్సులో సిగ్గుందా దీనికి? పైగా వెనకేసుకు వస్తావా నువ్వు"

సావిత్రి కళ్ల నిండా నీళ్ళొచ్చాయి. పీటర్ వెళ్ళిపోయాక నెలరోజులు కంటికి కడివెడుగా ఏడ్చిన సావిత్రి మళ్ళీ ఇప్పటి వరకూ కంట తడిపెట్టలేదు. ఆమె చివ్వున లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది. ఎంత అదిమి పెట్టినా భూమిలోంచీ ఎగదన్నుకు వచ్చే జలధారలా ఏడుపు పొంగి పొంగి వచ్చింది. రవీంద్రకి తనకీ ఇంత అసహ్యమైన సంబంధాన్ని... అందులోనూ తన తండ్రి అంటగట్టడమా? సావిత్రికి అసహ్యంగా వుంది. ఇంత అవాంఛనీయమైన మాటలు. అసహజమైన మాటలు తన తండ్రి తనని అనడమా/ తన యౌవ్వనంలో పెంచుకున్న అమాయకపు రొమాంటిక్ భావాల మీద, కోర్కెల మీద దెబ్బతీసి తను జీవితం పంచుకోవాలనుకున్న పీటర్ని తనకి కాకుండా చేసినప్పుడు... ఆ విధ్వంసాన్ని ఎంతో ధైర్యంతో ఎదుర్కొని మళ్ళీ ఒక జీవితాన్ని నిర్మించుకుంది. యూనివర్సిటీ లైబ్రరీలో .. తన విద్యార్థుల్లో– తను వ్రాసే పేపర్స్‌లో, పాల్గొనే సెమినార్స్‌లో జీవితాన్ని వెతుక్కుంది. మనుష్యులతో సాంగత్యాన్ని పోగొట్టుకుంది. అసలు మొదటినించీ తండ్రి తనని ఎవరితోనూ కలవ నివ్వకుండా జాగ్రత్త పడుతూనే వున్నాడు. తనని ఎంతో ప్రేమించిన పిన్నికి దూరం చేశాడు. ఆ పిన్నికి పుట్టిన పిల్లలతో సన్నిహితం కాకుండా చేశాడు. ఏ స్నేహాలు లేకుండా చేశాడు. పీటర్ని విసిరి వేశాడు. ఇప్పుడు ఈ రెండవ విశ్వరూపాన్ని ఎలా ఎదుర్కోవాలి తను? తనకీ రవీంద్రకీ అలాంటి సంబంధమా/ తలుచుకోవడానికి ఎంత సిగ్గుగా వుందో/ పైగా తన తండ్రి ... తను ఎవర్ని ఇంత కాలం ప్రేమించిందో... లక్ష్యపెట్టిందో .. ఆ తండ్రి! సావిత్రికి దుఃఖం కట్టలు తెంచుకుంది. పాతిక సంవత్సరాలు అణిచి పెట్టుకున్న దుఃఖం ... "ఏడవరా నాన్నా ఏడు. హాయిగా ఏడు. ఇన్నాళ్లు నవ్వకుండా మాట్లాడకుండా గడ్డకట్టిపోయావు. మనిషి లక్షణాలన్నీమర్చిపోయావు ఏడ్చి భారం వదిలించుకో, కరిగిపో...దా... ఇలారా నా వళ్ళో పడుకుని ఏడు" నులివెచ్చని సుధీర చెయ్యి ఆమె నుదుటి మీద పడింది.

ఈ పిల్లని తండ్రి ఒక్కనాడు దగ్గరికి తియ్యలేదు. తనని నెత్తిన పెట్టుకుని, అడుగడుగునా భేదం చూపించాడు. అయినా సుధీరకి తన మీద అసూయ లేదు. ద్వేషంలేదు. పిన్నిని తన మూలంగా ఎన్నో సార్లు తిట్టాడు నాన్నా. అయినా ఆవిడకి తన మీద ద్వేషం లేదు. వీళ్లతో మనస్సు విప్పి తనెప్పుడు మాట్లాడలేదు. సుధీరని కౌగలించుకుని మళ్ళీ ఏడ్చింది సావిత్రి. "ఎందుకే అలా ఏడుస్తావు/ తప్పు చేసింది చాలక! ఆ రవీంద్రగాడితో నీ తిరుగుడంతా నాకు తెలీదనుకున్నావా? మా వంశం ఎలాంటిదనుకున్నావు! వాళ్ళు దగ్గర పెట్టుకుని తిన్నగా వుండాలంటే వుండు. లేకపోతే నువ్వో నేనో ఉరి పోసుకుని చద్దాం" సూర్యనారాయణ అరుస్తున్నాడు. అతను ఏదో అంటునేవున్నాడు. సావిత్రి ఏడుస్తూనేవుంది.

అసలీ రవీంద్రతో తనకి స్నేహం ఎలా అయింది? యూనివర్సిటీలో ఇంత మంది వుండగా ఇతను తనకెందుకు సన్నిహితంగా వచ్చాడు? మంచుకి గడ్డ కట్టిన తనని ఎండలో పడేశాడు. ఇది స్నేహం. ఇది మనిషికీ మనిషికీ వుండే ఒక అద్భుతమైన సంబంధం. దీనిలో నీచమైన ఆలోచనలు లేవు. స్వార్థ ప్రయోజనాలు లేవు. అలాంటి స్నేహానికి ఆడ మగ అని జెండర్ వుండదని రవీంద్ర నమ్ముతాడు. తనూ నమ్ముతోంది. తనకి ప్రపంచం ఏం తెలుసు? మనుష్యుల గురించి ఏం తెలుసు. తనని మనుష్యుల్లో పడేసింది రవీంద్ర. మనుష్యుల్ని ప్రేమించడం నేర్పింది రవీంద్ర. పీటర్‌తోనే నీ జీవితం ఆఖరైపోలేదు. నువ్వు బ్రతకాలి. నవ్వాలి. నవ్వించాలి. అందరినీ ప్రేమించాలి.' అని

చెప్పింది రవీంద్ర. ఇందులో నీచాన్ని చూసే తన తండ్రిని ఏమనాలి? ఎలా నమ్మించాలి. ఆడకీ మగకీ మధ్య కేవలం శారీరక సంబంధమే వుంటుందని నమ్మే తన తండ్రి ఇలా తన మీద విరుచుకు పడడంలో ఆశ్చర్యం లేదు.

సుధీర సావిత్రిని లేవదీసింది.

సూర్యనారాయణ రెచ్చిపోయాడు. రేపటి నుంచీ రవీంద్రకి ఫోన్ చేశావంటే చచ్చిపోతానన్నాడు. అతనితో మాట్లాడితే చంపేస్తానన్నాడు. సావిత్రి మౌనంగా వున్న కొద్దీ అతను మరింత ఉగ్రుడయ్యాడు. సావిత్రి యూనివర్సిటీకి నెల రోజులు సెలవు పెట్టింది.

"ఇంత పిరికి దానివేమిటక్కా నువ్వు.." అంది సుధీర.

"నీ క్కావాలంటే చెప్పు. పెళ్ళి చేస్తాను. నీ వయస్సు వాడితో. అంతే! ఆ రవీంద్ర గాడితో తిరిగావంటే వాడి పెళ్ళానికి చెప్పేస్తాను."

తన తండ్రిలో యింత వికృతం దాగి వుందని సావిత్రి ఎప్పుడూ ఊహించలేదు.

సీతాపతికి సావిత్రిసెలవు పెట్టిందంటే ఆనందంగా వుంది. ఆమె నీరసంగా వుందంటే ఆనందంగా వుంది. "పనిలో పనిగా సుధీరకి కూడా పెళ్ళి చేసెయ్" అన్నాడు. అది తన వలన కాదని సూర్యనారాయణకి తెలుసు. పై గా సుధీర తెలివి మీద ఆయనకి నమ్మకం వుంది. సుధీరతో ఎటాచ్‌మెంటు లేదు. ఆమె తన మనిషి కాదు. సుభద్ర మనిషి. వారంరోజులుగా సావిత్రి యూనివర్సిటీకి రాలేదని రవీంద్ర వచ్చాడు. అతడిని కసురుకుని పంపాడు సూర్యనారాయణ. ఆ తరువాత అతను సుభద్ర మీద దండెత్తాడు.

"సవతి కూతురు కదా అని దాన్నినువ్వు నిర్లక్ష్యం చేశావు. దాన్ని నీ కూతుర్లా దగ్గరికి తీసుకుంటే ఈ వయస్సులో అది ఇలాంటి పన్లు చేస్తుందా? నీ మూలంగానే ఈ కుటుంబం ఇల్లు నాశనం అయింది. డిసిప్లిన్ లేకుండా పోయింది."

సుభద్ర మౌనంగా వుండి పోయింది.

"ఎందుకమ్మా సమాధనం చెప్పవ్? నువ్వు నన్ను దగ్గరికి తియ్యలేదా? ఆయనే నీ దగ్గరికి నన్ను రానీ లేదా? చెప్పు" అంది సావిత్రి.

సుభద్ర నవ్వి "పూర్వం రాజుల పిల్లలు చదువుకోవడానికి గురువుల దగ్గరికి వెళ్ళేవారు. వాళ్ళు సరిగ్గా చదవకపోయినా, తప్పు చదివినా వాళ్ళని కొట్టడానికి పంతులు గారికి హక్కు లేదు. రాజుగారి పిల్లలు గనుక! అందుకని వాళ్ళ బదులు దెబ్బలు తినడానికి డబ్బులిచ్చి అదే ఈడు పిల్లల్ని పెట్టుకునే వాళ్లు. వాళ్ళని దెబ్బలబ్బాయిలనేవాళ్ళు. నేనలాంటి దెబ్బలబ్బాయినమ్మా . అలా దెబ్బలు తిన్నందుకు నాకు రెండు పూటలా భోజనం .. మంచి చీరలు.. ఇదిగో ఈ నగలు యిచ్చి సంతోష పెడతారు. అది నా ఉద్యోగం." అని లోపలికి వెళ్లిపోయింది.

"ఈ . ఉక్క పోతలో ఊపిరాడని తనంతో నేను బ్రతకలేను నాన్నా. నేను వేరే ఇల్లు చూసుకుని వెళ్ళిపోతున్నాను. నువ్వు నాకు లేని ఎన్ని నీచమైన సంబంధాలు అంట గట్టినా నేను లెక్క చెయ్యను. నా బ్రతుకులో మూడు వంతులు ఊపిరి పీల్చకుండా గడిచిపోయింది. మిగిలిన ఈ ఒక్క వంతైనా నన్ను నాక్కావల్సింది తిని యిష్టం వచ్చిన పాట విని నచ్చిన స్నేహితులతో మాట్లాడి నచ్చిన పని చేసుకుంటూ బ్రతకనియ్."

"అంటే నీకు ఆ రవీంద్రతో ఎలాంటి సంబంధం లేదంటావు"


నేటి కథ, కవిత, నవలలపై

జనవరి సంచికలో

ప్రముఖులు రాసిన సమీక్షాత్మక
వ్యాసాలు చదవండి


"వుంది నాన్నా. మనిషికీ మనిషికీ ఉండే సంబంధం. స్నేహితుడికి స్నేహితుడికీ ఉండే సంబంధం...నీ ఊహకి అందని సంబంధం".

"పొండి....పొండి. ఒక్కొక్కరే వెళ్లి పొండి. ఆఖరికి సుభద్రని కూడా పొమ్మను. మీరంతా గొప్పవాళ్ళయిపోయారు. ఈ ముసలి వాడితో ఇంక మీకేం పని? ఇలా జరుగుతుందని సీతాపతి నాకెప్పుడో చెప్పాడు. అందుకే వాడి జాగ్రత్తలో వాడున్నాడు. నేను మిమ్మల్ని ప్రేమించాను. అందుకే చదివించి ఇంత వాళ్ళని చేశాను. వాడిలా చేసి వుంటే చచ్చినట్లు పడివుండేవాళ్లు. మీకు కృతజ్ఞతలు లేవు. మీరంతా చెడిపోయారు."

సూర్యనారాయణకి అరిచీ అరిచీ తల తిరిగిపోయింది.

కళ్ళు తెరిచి చూసేసరికి అతని తల సుధీర వళ్ళో ఉంది. ఆమె చెయ్యి అతని నుదుటి మీద వుంది. సుధీర చెయ్యి చల్లగా వుండదు. వేడిగానూ వుండదు. నులి వెచ్చగా వుంటుంది. ఆ "వార్మ్త్" అదే ప్రాణం యిచ్చేది. బహుశా ఆ"వార్మ్త్"ఆమె హృదయంలోంచి చేతిలోకి ప్రవహించి వుండవచ్చేమో!

"మనుష్యులందర్నీ వర్గాలుగా, మతాలుగా, కులాలుగా, శాఖోప శాఖలుగా, ఆడగా, మగగా, చిన్న వాళ్లుగా, పెద్ద వాళ్ళుగా వీలైనన్ని ముక్కలు ముక్కలుగా విడ గొట్టి ఎవరి చుట్టూ వారికి పరిధులు నిర్మించి, అందులో వాళ్ళని బంధించి, వాళ్ళు అవి దాటి రాకుండా కాపలా కాస్తేనే ఈ వ్యవస్థ పది కాలాల

పాటు సురక్షితంగా వుంటుంది. ఈ కాపలా కాసే బాధ్యత రాజకీయంగా కొందరు నెత్తిన వేసుకుని స్వప్రయోజనం సాధించుకుంటే, సాంస్కృతికంగా కొందరు భుజాన వేసుకుని లాభం పొందుతారు. మనిషినీ మనిషినీ కలవనీకుండా ఒక రికళ్ళల్లోకి ఇంకొకర్ని వెళ్ళనీకుండా పకడ్బందీగా పహారా పెట్టడమే వీళ్ళ ధ్యేయం. ఒక మనిషిలో నుంచి ఇంకో మనిషిలోకి జ్ఞానం ప్రవహించరాదు. ఒక మనిషిలో నుంచి ఇంకో మనిషిలోకి ప్రేమ ప్రవహించరాదు. అట్లా జీవితాల్ని సంకుచితం చేసేశారు. ఆఖరికి భాషని కూడా సంకుచితం చేశారు. ప్రేమకీ, ఆప్యాయతకీ, ఆత్మీయతకీ వికృత భాష్యాలు చెప్తారు. ఎందుకు, ఎందుకిదంతా? ఈ సాంస్కృతిక పెత్తందారీతనాన్ని నీ స్నేహితుడు, నీ గురువు .. నీ హితుడు సీతాపతి మామయ్య భుజాన వేసుకుని నీ కుటుంబాన్ని ఇలా ముక్కలు చేశాడు. నెపం మా మీద మోపుతున్నాడు. నువ్వెంత చీదరించుకున్నా అమ్మ ఈ కుటుంబాన్ని కొంగు పట్టి కాపాడింది. నువ్వు ఎంత అన్యాయం చేసినా అక్క గుమ్మం దాటలేదు. నువ్వు ఎంత అవమానం చేసినా కరుణ ఇంకా నిన్ను ప్రేమిస్తూనే ఉంది. అది అర్థం చేసుకోలేని నువ్వు ప్రతి క్రొత్త పరిచయాన్ని చూసి జడుసుకుంటున్నావు. నిన్ను మాతో పాటు నడిపించుకుపోవడానికి మేం ప్రయత్నించలేదు. నిన్ను ఎడ్యుకేట్ చెయ్యాలని ప్రయత్నించలేదు. అది మా తప్పే కావచ్చు. ఒక్కొక్క మాటే తూచి తూచి మాట్లాడిన సుధీర సూర్యనారాయణ కళ్ళలోకి దయగా చూసి నవ్వింది. ఆ వెలుగు, ఆ విశ్వాసం, ఆ అచంచలమైన ప్రేమ, కారుణ్యం. అవును. అవంటేనే పూర్వం తనకి జంకుగా వుండేది.

"మనిషికి కావల్సింది కొంచెం ప్రేమ....కొంచెం జ్ఞానం ..... అహంకారం కాదు" అంటాయి ఆమె కళ్ళు.

